గడప వద్దకే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి

ఊటుకూరు(గంపలగూడెం): కులం, మతం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా గడప వద్దకే సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరులో నాల్గవ రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. అధికారులను వెంటబెట్టుకొని స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని గాంధీసెంటర్, ఆవలవారి బజారు, ఉత్తర దళితవాడల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలు మరింత జరగాలంటే 2024 ఎన్నికల్లో ఓటర్లు వైఎస్సార్ సీపీని మరోమారు గెలిపించాలన్నారు. ఊటుకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కే శామ్యూల్, సర్పంచ్ రేణుక, ఏఎంసీ చైర్మన్ నాగనర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నర్సారెడ్డి, చెన్న కేశవరెడ్డి, డీఎస్ఆర్, కాజా నాగేంద్రరావు, గద్దల మనీష, సంగీతం రాఘవయ్య, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

ఊటుకూరు(గంపలగూడెం): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలను అందజేస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కె. రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరు–2లో రూ.61.8 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాలు ఏర్పాటు చేసిన తర్వాత ప్రజలకు వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ఇళ్ల ముంగిటే సేవలను అందజేస్తూ ప్రజాదరణ పొందుతున్నారన్నారు. ఊటుకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, ఏఎంసీ చైర్మన్‌నాగనర్సిరెడ్డి, ఊటుకూరు, గాదెవారిగూడెం సర్పంచ్‌లు రేణుక, శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంటేశ్వరరావు, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, పీఆర్ డీఈ చక్రవర్తి, ఏఈ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



ఊటుకూరులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. స్థానిక అడవిక్వారీ ప్రాంతంలోని 40 మంది పేదలకు కొండపల్లి జగనన్న లేఅవుట్‌లో బుధవారం పట్టాలు పంపిణీ చేశారు. పేదల సొంతింటి కల నిజం చేసేదిశగా నియోజకవర్గం వ్యాప్తంగా 20 వేల మందికి, కొండపల్లి పరిధిలో 3,200 మందికి స్థలాలు పంపిణీ చేశామన్నారు. స్థలాల పంపిణీ నిరంతర ప్రక్రియ అన్నారు. ఇప్పటికే నూతన ఈఎస్ఐ భవనం, ఆరోగ్య కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్బీకేలు, సచివాలయ భవనాలు నిర్మించామన్నారు. అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ నాయకులు ఆటంకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొండపల్లి కోటయ్యనగర్‌లో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15.05 లక్షలతో సిమెంటు రోడ్లు, డ్రెయినేజీ నిర్మిస్తామన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం జలజీవన్ మిషన్ పథకంలో నిధులు మంజూరైనట్లు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు పోరంకి పద్మావతి, పోలగంగు రాణి, తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

క్లుప్తంగా

సామూహిక సాయివ్రతాలు



తిరువూరు: ఏకాదశి సందర్భంగా స్థానిక షిర్డీ సాయి మందిరంలో బుధవారం సామూహిక సాయివ్రతాలు నిర్వహించారు. సాయిబాబాకు అష్టోత్తర శతనామాలతో విశేషార్చనలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులు సాయివ్రతాలు ఆచరించారు. మందిర కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ అధ్యక్షురాలు గూడపాటి మాణిక్యాంబ పర్యవేక్షించారు.

చిన్నారుల ఎదుగుదల తల్లులదే బాధ్యత



మొర్సుమల్లి(మైలవరం): చిన్నారుల ఎదుగుదలకు తల్లులు బాధ్యత వహించాలని పాఠశాల హెచ్ఎం పీ గోపాల్ పేర్కొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మైలవరం గ్రామం అంగన్‌వాడీ కేంద్రం–8లో జన భాగీదారీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పసి వయసులో చూసి న, విన్న అంశాల ఆధారంగా చిన్నారులు బుద్ధిని, తెలివి తేటలను వికసింపజేసుకుంటారన్నారు. ఐదేళ్ల వరకు అంగన్‌వాడీల్లో పిల్లలు ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అందుబాటులో ఇంటర్మీడియెట్ విద్య

మునునూరు హైస్కూల్ హెచ్ఎం సునీల

ముసునూరు: మండలం, సమీప గ్రామాల్లోని బాలికలకు అందుబాటులో నాణ్యమైన ఇంటర్మీడియెట్ విద్య లభిస్తుందని ముసునూరు హైస్కూల్ హెచ్ఎం ఏ సునీల పేర్కొన్నారు. మండలంలోని చింతలవల్లిలో బుధవారం హైస్కూల్ ఉపాధ్యాయులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. బాలికలకోసం ముసునూరు హైస్కూల్లో ఇంటర్మీడియెట్ విద్యను బోధిస్తున్నట్లు చెప్పారు. ముసునూరు హైస్కూల్లో అన్ని సౌకర్యాలతో బాలికలకు ఉచితంగా ఇంటర్మీడియెట్ విద్యను బోధిస్తున్నందున పదో తరగతి పాసైన స్థానిక విద్యార్థినులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్, యువరాజు, నాగేశ్వరరావు, చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, శివనాగమణి, జాన్సీ పాల్గొన్నారు.

వ్యాగన్ వర్క్‌షాపులో వైద్య శిబిరం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కార్మికులకు ప్రపంచ బ్లడ్ డోనర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్, రైల్వే వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు బుధవారం ఏర్పాటు చేశారు. శిబిరం ప్రారంభించిన వ్యాగన్‌వర్క్‌షాపు చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ రక్తదానం చేసిన ఉద్యోగులు, కార్మికులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. పలు కార్పొరేట్ వైద్యశాలల వైద్యులు కార్మికులకు కంటి, దంత పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు సుమలత, సుభద్ర, రమేష్ పాల్గొన్నారు.



ఉద్యోగుల నుంచి రక్తం సేకరిస్తున్న లైన్స్‌క్లబ్ సభ్యులు

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

జక్కంపూడి(విజయవాడరూరల్): రాష్ట్రంలో సచివాలయాల వ్యవస్థతో సుపరిపాలన సాగుతోందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి–షాబాద గ్రామంలో రూ.25లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్‌వెల్ నెస్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే వసంత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతి, వివక్షత లేని పరిపాలన ప్రజలకు చేరువ కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయాల ద్వారా సుమారు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 600 సేవలకు పైగా అందుబాటులో ఉంటాయన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటిముంగిటకే మెరుగైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారని తెలిపారు. నాలుగు సంవత్సరాల్లో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు గురించి ఎమ్మెల్యే వివరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 48 కోట్లతో డ్రైన్ల నిర్మాణం పనులు జరిగితే వాటిలో మైలవరం నియోజకవర్గంలో రూ.24 కోట్లు ఖర్చుతో డ్రైన్లు నిర్మించడం జరిగిందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

ఇళ్లు లేకుండా చేసిన ఘనత దేవినేని ఉమాదే..

జక్కంపూడి గ్రామంలో వందలాది ఎకరాలను టిడ్కో ఇళ్ల నిర్మాణాల కోసం తీసుకుని, ఒక్క కుటుంబానికి ఇళ్లు లేకుండా చేసిన ఘనత ఉమాదేనని ఎమ్మెల్యే వసంత పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో 160 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, గృహాలను నిర్మించామన్నారు. షాబాదు గ్రామ పార్టీ కన్వీనర్ ఎల్.వెంకటకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెనున్న ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కల్పన, కె.తాడేపల్లి సొసైటీ చైర్మన్ ఎల్.పుండరీక వర్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఇబ్రహీంపట్నం: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఎన్టీటీపీఎస్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. ఆరోగ్యవంతులు ప్రతి నాలుగు నెలలకు ఓసారి రక్తదానం చేయడం ద్వారా నూతన రక్తకణాలు పుటుకొస్తాయన్నారు. మీరుచేసే రక్తదానం ఒకరి జీవితం కాపాడుతుందన్నారు. ప్రతియేటా 80లక్షల యూనిట్ల రక్తం కొరత ఉందని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని డీఎంహెచ్‌ఓ సుహాసిని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో ఉషారాణి, చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్, సీనియర్ జూనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగికి సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, డీఎంహెచ్ఓ

నూజివీడులో..

నూజివీడు: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియా ఆస్పత్రి సహకారంతో స్థానిక ట్రిపుల్ ఐటీలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి నాలుగు నెలలకొకసారి రక్తాన్ని ఇవ్వొచ్చన్నారు. ఈ శిబిరంలో 54 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. పరిపాలనాధికారి పి.ప్రదీప్, వైద్యులు ఏ హరికృష్ణ, దుర్గాభవానీ పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలుర పాఠశాలలో శుక్రవారం డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ సీహెచ్ పుష్పలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8–9 ఏళ్ల వయస్సు గల 4వ తరగతి, 9–10 ఏళ్ల వయస్సునన 5వ తరగతి బాలబాలికలు ఈనెల 16న ఎంపీడీఓ, తమ పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు, ఎంఈఓ ద్వారా హాజరు కావాలని కోరారు. మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలు జిల్లా స్థాయిలో ఆడాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మైలవరం: విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పీ ధనలక్ష్మి తెలిపారు. మైలవరం ఆరో వార్డులోని ఎంపీపీ పాఠశాలలో జగనన్న విద్యా కిట్లు బుధవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ ఎల్.బాలు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం విద్యార్థికి నీట్‌లో 219వ ర్యాంక్

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి నాగుబండి ఈశ్వర్ వెంకట్ నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 720 మార్కులకుగాను 700 మార్కులతో 219వ ర్యాంక్, ఈడబ్ల్యూఎస్‌లో 12వ ర్యాంక్ సాధించినట్లు అతడి తండ్రి దీలిప్‌కుమార్ బుధవారం తెలిపారు. విజయవాడలోని ఒక ప్రైవేటు కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఈశ్వర్‌వెంకట్ నీట్‌లో ప్రతిభకనబర్చడంపై ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు.



ఈశ్వర్ వెంకట్

సంక్షిప్త వార్తలు

పేకాట శిబిరంపై దాడి

తిరువూరు: స్థానిక బస్టాండు సెంటర్లో జూదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం దాడి నిర్వహించారు. 10 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి రూ.32,620ను స్వాధీనపరచుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని సెక్టార్–1 ఎస్ఐ సతీష్ తెలిపారు.

అంగన్‌వాడీ విద్యపై ప్రత్యేక శ్రద్ధ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రాథమిక విద్య అందించే విషయంపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు మైలవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. జన భాగీదారీ కార్యక్రమంలో భాగంగా కొండపల్లి నేతాజీనగర్‌లో చిన్నారులు ప్రాథమిక విద్యపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలి

నూజివీడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని తుక్కులూరు, గొల్లపల్లిలోని సచివాలయాలను బుధవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదేనన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, సాయంత్రం మూడు నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి అర్జీలు తీసుకోవాలన్నారు.

17న సహకార ఉద్యోగుల సమస్యలపై చర్చ

నూజివీడు: సహకార ఉద్యోగుల సమస్యలపై ఈ నెల 17న చర్చించేందుకు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉన్నతస్థాయి అధికారుల సంయుక్త సమావేశం విజయవాడలో జరుగనుందని సహకార ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు నీలం నాగేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 9న ఆప్కాబ్ కార్యాలయం వద్ద ధర్నా చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారుల నుంచి చర్చలకు పిలుపువచ్చిందన్నారు.

జగనన్న గృహాలకు సంబంధించి మట్టి తోలకాలకు అనుమతులు ఇస్తాం

చాట్రాయి: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలకు మట్టి తోలకాలకు అనుమతులు ఇస్తామని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. మండలంలోని చనుబండ గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను ఆయన బుధవారం పరిశీలించారు. వర్షాలు పడితే మట్టి తోలుకోలేమని నిర్మాణాలు పూర్తి చేసుకోలేమని, బేస్‌మెంట్‌లో మట్టిని తోలుకుని దర్వాజాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని లబ్ధిదారులు తహసీల్దార్‌కి విన్నవించారు. జిల్లా అధికారులతో మాట్లాడి లబ్ధిదారులకు త్వరితగతిన మట్టి తోలకాలకు అనుమతులు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.

దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

నూజివీడు: ప్రతి మహిళ, యువతులు తమ స్మార్ట్‌ఫోన్‌లలో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, దీనివల్ల పోలీసులు మీ వెంట ఉన్నట్లేనని రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో బుధవారం దిశయాప్ ప్రత్యేక డౌన్‌లోడ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వయం ఉపాధికి చేయూత

తిరువూరు: పట్టణంలో పేద కుటుంబాలకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి పథకం కింద బడ్డీ దుకాణాలను ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు బుధవారం పంపిణీ చేశారు. రాజుపేటలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మహ్మద్ రఫీ 20 మందికి ఈ దుకాణాలను పంపిణీ చేశారు.

అడుగంటిన భూగర్భజలాలు

తిరువూరు: వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో పట్టణంలో భూగర్భ జలాలు అడుగంటాయి. బోర్లలో నీటి సామర్థ్యం తరిగిపోవడం, కట్టిలేరు పంపింగ్ స్కీం వద్ద ఫిల్టర్ పాయింట్లలో కూడా నీరందకపోవడంతో నగర పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కుళాయిల ద్వారా రోజూ పట్టణంలోని 20 వార్డులలో నీరందించడం కష్టతరంగా మారడంతో తాత్కాలికంగా మూడు ట్యాంకర్లను ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. తాగునీరు పొదుపుగా వాడుకోవాలని కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఐదో డివిజన్‌లో ఈ నెల 12వ తేదీన గుండె పోటుతో మృతి చెందిన చిటారెడ్డి శివకుమార్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదును బుధవారం అందజేశారు. ఆయన మరణించిన రోజున 5వ వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ వలంటీర్ల ద్వారా సచివాలయ సిబ్బందితో వైఎస్సార్ బీమాకు నమోదు చేశారు. సాధారణ మరణం కింద రూ.లక్ష మంజూరు కావడంతో తక్షణ మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. మిగిలిన రూ.90వేలు మరణ ధ్రువీకరణ పత్రం అందజేసిన అనంతరం అకౌంట్‌లో జమచేస్తారు.

నేడు విద్యార్థులకు పారితోషికాల పంపిణీ

తిరువూరు: ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వ ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే కే రక్షణనిధి తిరువూరులో సన్మానిస్తారని ఎంఈఓ రామకృష్ణ తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

తొమ్మిదివేల మందికి ఉపాధి

గంపలగూడెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బుధవారం మండలంలోని తొమ్మిదివేల మంది కూలీలకు ఉపాధి చూపినట్లు ఎన్ఆర్ఈజీఎస్ పథకం ఏపీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలలో నిర్వహించిన 237 పనులలో 725 గ్రూపులకు చెందిన కూలీలు పనులలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అమ్మిరెడ్డిగూడెం, మేడూరు, పెద్దకొమిర, వినగడప గ్రామాల్లో చెరువుల్లో అమృత సరోవర్ పథకంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు.

డాక్యుమెంట్స్ పోయినవి

యర్రంశెట్టి రాధిక W/o వెంకట రామారావు D.No. 6/14/1, సిబ్బంది పేట, నూజివీడు (పట్టణం & మండలం) ఏలూరు జిల్లా వారికి చెందిన R.S No's : 399, 400, 401, 798 డాక్యుమెంట్ నెంబర్లు : 933 / 2010 మరియు 5961/2006 జిరాక్స్ కాపీలు తీయించడానికి చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌కు వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికిన వారు పై అడ్రసులో సంప్రదించగలరు.